సాక్షి ప్రకాశం

ఆదివారం । 24 । ఆగస్టు । 2025



చెడిపోయిందంటే చావే

సింగరాయకొండలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రం ఐదు నెలలుగా మూతపడింది. దీంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో..



పూరి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి

పూరి–తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేసి 4 కేజీల గంజాయిని పట్టుకుని ముగ్గురిని అరెస్టు చేశారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36 /27

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

25న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలి

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో డీఎస్సీ–2025 కు సంబంధించి వివిధ కేటగిరీల్లో 629 పోస్టులకు సెలెక్షన్ కమిటీ నిర్ణయించిన కమిటీలచే ఎంపికైన అభ్యర్థులందరూ ఈ నెల 25వ తేదీ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని డీఈఓ కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు చెరువుకొమ్ముపాలెంలోని సరస్వతి జూనియర్ కళాశాలలో హాజరు కావాలని కోరారు. మెసేజ్ వచ్చిన అభ్యర్థులు మూడు సెట్ల అటెస్టెడ్ అన్ని సర్టిఫికెట్ కాపీలతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని కోరారు. వెరిఫికేషన్‌కు హాజరైనప్పుడు ఒరిజినల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పోస్ట్‌గ్రాడ్యుయేట్, బి.ఎడ్, డి.ఎడ్, బి.పి.ఎడ్, పండిట్ ట్రైనింగ్ సర్టిఫికెట్‌లతో పాటు క్యాస్ట్ సర్టిఫికెట్, డిసేబుల్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు బయోమెట్రిక్ అటెండెన్స్ కోసం తీసుకొని రావాల్సిందిగా డీఈఓ కోరారు.

పీహెచ్‌సీ వైద్యుల ఇన్‌సర్వీస్ పీజీ కోటా తగ్గింపు తగదు

- ఏపీ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్



జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం అందిస్తున్న వైద్య సంఘ బాధ్యులు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న డాక్టర్ల ఇన్ సర్వీస్ పీజీ కోటాను 20 నుంచి 15 శాతానికి తగ్గించటం తగదని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ అసోసియేషన్ బాధ్యులు పేర్కొన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కాలమాల రాహుల్, జనరల్ సెక్రటరీ షేక్ ఖాదర్ మస్తాన్ బి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుందర్ ప్రసాద్, అసోసియేషన్ సభ్యులు డాక్టర్ నబి వలి, డాక్టర్ కుమార స్వామి తదితరులు పాల్గొని జిల్లా వైద్యాధికారి డాక్టర్ టీ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చర్చల సందర్భంలో సర్వీస్ కోటాలో తగ్గించే ఉద్దేశం ఉంటే అసోసియేషన్ ప్రతినిధులతో చర్చిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించినదని అన్నారు. కేవలం ఏడు శాఖల్లో సర్వీస్ కోటా కాకుండా గతంలో మాదిరిగా అన్ని శాఖల్లో సర్వీస్ కోటా అమలయ్యేలా చూడాలని కోరారు. గిరిజన పల్లె ప్రాంతాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వైద్యుల కేరీర్‌పై సర్వీస్ కోటా తగ్గింపు అశనిపాతంలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమలు చేస్తున్న 20 శాతం కోటాను యధావిధిగా అమలు చేయాలని విన్నవించారు.

కబ్జా విస్తరిస్తూ.. కార్పొరేషన్ విస్మరిస్తూ!

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నగరపాలక సంస్థ అనుమతుల నిరాకరణ.. వైద్యారోగ్యశాఖకు చెందిన భూమిని కబ్జా చేసి మరీ అడ్డగోలుగా నిర్మాణం.. జిల్లా సర్వోన్నతాధికారులు సభ్యులుగా ఉన్న ఓ క్లబ్ కమిటీ నిర్వాకమిది. రిక్రియేషన్ కోసం నగరం నడిబొడ్డున ఏర్పాటు చేసిన హైదరీ క్లబ్ నేడు కబ్జాలు, అక్రమాలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ కమిటీలో కీలకంగా ఉన్న ఓ వ్యక్తి చక్రం తిప్పుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కార్పొరేషన్ కార్యాలయానికి కూత వేటు దూరంలో నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతివ్వని కార్పొరేషన్
- అయినా హైదరీ క్లబ్ కమిటీ అడ్డగోలుగా నిర్మాణాలు
- వైద్యారోగ్య శాఖకు చెందిన స్థలం కబ్జా
- క్లబ్ కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, సభ్యునిగా ఎస్పీ
- కమిటీలో సభ్యులుగా జిల్లా అధికారులు, రిటైర్డ్ అధికారులు
- పక్కనే నిర్మాణాలు జరుగుతున్నా.. పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు
- నిబంధనలు అమలు చేయాల్సిన వారే తుంగలో తొక్కితే ఎలాగంటున్న ప్రజలు



నిబంధనలకు విరుద్ధంగా హైదరీక్లబ్ కమిటీ నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: నగరంలో అత్యంత విలువైన ప్రాంతం.. ఒక పక్క పీడీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయం, మరో పక్క ఒంగోలు ఆర్డీఓ కార్యాలయం.. వెనుకవైపు ఓల్డ్ రిమ్స్ ప్రాంగణం. ఎదురుగా ఒంగోలు హెడ్ పోస్టాఫీస్... వీటన్నింటి మధ్యలో ఒంగోలు నగర పౌరుల రిక్రియేషన్ కోసం ఏర్పాటు చేసిన హైదరీ క్లబ్. ఈ క్లబ్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసుకుంటూ క్లబ్ ప్రాంగణంలో కలుపుకుంటూపోతున్నారు నిర్వాహకులు. క్లబ్ కోసం గతంలో కేటాయించిన స్థలంతో పాటు చుట్టుపక్కల స్థలాలను కూడా ఇప్పటికే కలిపేసుకున్నారు. కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా నామినేటెడ్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఈ హైదరీ క్లబ్ కమిటీకి ఎస్పీ ఏఆర్ దామోదర్ మెంబర్‌గా కూడా ఉన్నారు. వీళ్లిద్దరికీ కమిటీలో ఎన్నికలు ఉండవు. వైస్ ప్రెసిడెంట్ మొదలుకుని మిగతా కమిటీకి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఈ కమిటీలో కీలక వ్యక్తి మొత్తం తానై వ్యవహరిస్తూ అక్రమాలకు తెగబడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుమతి లేకుండానే కమర్షియల్ కాంప్లెక్స్...

క్లబ్‌కు కేటాయించిన స్థలం కాకుండా వైద్యారోగ్య శాఖకు చెందిన దాదాపు 300 గదులకుపైగా స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా కమిటీ కబ్జా చేసింది. కబ్జా చేసిన స్థలంలో హైదరీ క్లబ్ ప్రధాన గేటుకు పడమరవైపు ఉన్న స్థలంలో రోడ్డు ముఖ ద్వారంగా ఎలాంటి అనుమతులు లేకుండా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని హడావిడిగా చేపట్టారు. ఆ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ఒంగోలు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో క్లబ్ పాలకమండలి దరఖాస్తు చేసుకుంది. అందుకోసం నిబంధనల ప్రకారం నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన రుసుంలు కూడా చెల్లించింది. అయితే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం ప్లాన్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాన్‌ను తిరస్కరించారు. కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలంటే ఆ స్థలాన్ని నగరపాలక సంస్థకు మార్ట్‌గేజ్ చేయాల్సి ఉంది. మార్ట్‌గేజ్ లేకుండానే ప్లాన్ అప్రూవల్ కోసం కమిటీ దరఖాస్తు చేసుకుంది. మార్ట్‌గేజ్ కోసం ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి కమిటీ పేరుమీద మార్ట్‌గేజ్ చేయాలని కోరారు. అది ప్రభుత్వ స్థలమని, హైదరీ క్లబ్ పేరు మీద మార్ట్‌గేజ్ చేయడం నిబంధనలకు విరుద్ధమని వాళ్లు కూడా తిరస్కరించారు.



కమిటీలో రిటైరైన జిల్లా స్థాయి అధికారులు...

హైదరీ క్లబ్ కమిటీలో రిటైరయిన జిల్లా స్థాయి అధికారులు కూడా ఉన్నారు. రెవెన్యూలో పనిచేసిన తహసీల్దార్లు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల్లో పనిచేసిన అధికారులు కూడా పాలక మండలితో పాటు కమిటీలో సభ్యులుగా కొనసాగుతున్నారు. వాళ్లే దగ్గరుండి మరీ అక్రమ నిర్మాణాన్ని చేపట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమాల మీద బయటకు వచ్చి మాట్లాడే సాహసం ఎవరూ చేయలేకపోయినా ఇంత అడ్డగోలుగా వ్యవహరిస్తారా అంటూ లోలోపల మదనపడుతున్నారు. కలెక్టర్ ప్రెసిడెంట్‌గా ఉండే హైదరీ క్లబ్‌లోనే ఈ విధంగా జరిగితే ఇక ప్రభుత్వ నిబంధనలను, చట్టాన్ని పరిరక్షించేవారెవరంటూ నిలదీస్తున్నారు.

రిక్రియేషన్‌ను కమర్షియల్‌గా మార్చి...

హైదరీ క్లబ్ కోసం మొదట్లో ప్రభుత్వం కేటాయించిన స్థలం రిక్రియేషన్ కోసం. కానీ, ప్రస్తుత కమిటీ దానిని కమర్షియల్‌గా మార్పు చేసి అడ్డగోలుగా వ్యవహరిస్తోంది. కమిటీ కబ్జా చేసిన స్థలాన్ని ఒక ఆదాయ వనరుగా మలచుకునే ప్రయత్నమే హడావిడిగా అక్రమంగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం. క్లబ్ ఉండే స్థలం ప్రధాన కూడలి కావటంతో వ్యాపారానికి అనువుగా మారింది. దాంతో అడ్డగోలుగా అయినా సరే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించి అద్దెలకిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కమర్షియల్ కాంప్లెక్స్‌లోని షాపులను ఓపెన్ ఆక్షన్ ద్వారా కాకుండా అయినవారికి కట్టబెట్టే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టారు. ఇప్పటికే షాపులను అద్దెలకు కేటాయించి రూ.లక్షల్లో అడ్వాన్స్‌లు కూడా తీసేసుకున్నట్లు సమాచారం.

అక్రమంగానే భవన నిర్మాణం పూర్తి...

ఒంగోలు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాన్ అప్రూవల్‌ను తిరస్కరించారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకున్న తర్వాతే కమర్షియల్ కాంప్లెక్స్‌ను హైదరీ క్లబ్ కమిటీ నిర్మించాల్సి ఉంది. కానీ, అలాంటిదేమీ లేకుండానే నగరం నడిబొడ్డులో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకపోయినా రోడ్డు మీదనే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తుంటే ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్‌గానీ, టౌన్ ప్లానింగ్ అధికారులుగానీ కనీసం దానివైపు కన్నెత్తి కూడా చూడలేదు. అడ్డగోలుగా అక్రమంగా అంత పెద్ద భవన నిర్మాణం జరుగుతుంటే కళ్లప్పగించి చూస్తున్నారే తప్ప ఆ నిర్మాణాన్ని నిలువరించే ప్రయత్నం కనీసం కూడా చేయలేదు.

> **ప్లానును తిరస్కరించాం**
>
> హైదరీ క్లబ్ పాలకమండలి కమర్షియల్ కాంప్లెక్స్ కోసం చేసుకున్న దరఖాస్తును తిరస్కరించాం. కమర్షియల్ కాంప్లెక్స్ కోసం చేసుకున్న ప్లాను నిబంధనల ప్రకారం లేదు. కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆ స్థలాన్ని ఒంగోలు నగరపాలక సంస్థకు మార్ట్‌గేజ్ చేయాల్సి ఉంది. వాళ్లు సమర్పించిన ప్లాన్‌లో మార్ట్‌గేజ్ డాక్యుమెంట్లు లేవు. ఇంకా కొన్ని డాక్యుమెంట్లు వాళ్లు సమర్పించాల్సి ఉంది. అవేమీ లేకపోవటంతో ప్లాన్ అప్రూవల్ ఇవ్వలేదు. దీనిపై అదనపు సమాచారం కావాలంటే కమిషనర్ వెంకటేశ్వరరావును సంప్రదించండి.
>
> – జెడ్ సుధాకర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, ఒంగోలు నగరపాలక సంస్థ

పౌరుషం, త్యాగానికి ప్రతీక ప్రకాశం పంతులు



ఉప్పు సత్యాగ్రహ విజయ స్థూపం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జేసీ గోపాల కృష్ణ, ఇతర అధికారులు

- నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి
- జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ
- ఘనంగా ఆంధ్ర కేసరి 154వ జయంతి వేడుకలు

ఒంగోలు సబర్బన్: పౌరుషం, త్యాగం, ప్రతిభకు ప్రతీకగా నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆంధ్ర కేసరి 154వ జయంతిని పురస్కరించుకుని శనివారం దేవరంపాడులోని ఉప్పు సత్యాగ్రహ విజయ స్థూపం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రకాశం పంతులు, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధునిగా, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు తనదైన ముద్ర వేశారని అన్నారు. సవాళ్లకు ఎదురొడ్డి ధైర్యంగా ముందుకు సాగిన ప్రకాశం పంతులును నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని, తాము ఎంచుకున్న రంగంలో విజేతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ స్మారకం వద్ద రెండు ఎకరాల విస్తీర్ణంలో డ్వామా ఆధ్వర్యంలో పల్లెవనం ఏర్పాటు చేయిస్తామని ఆయన ప్రకటించారు. స్థూపం చుట్టూ పెండింగ్‌లో ఉన్న ప్రహరీ నిర్మాణాన్ని కూడా త్వరలో పూర్తి చేయిస్తామని తెలిపారు. మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేలా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళతానని చెప్పారు. కార్యక్రమంలో డీపీఓ వెంకట నాయుడు, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఒంగోలు రూరల్ తహశీల్దార్ షేక్ నాయబ్ రసూల్, రూరల్ డిప్యూటీ తహశీల్దార్ కొల్లిబోయిన అశోక్ కుమార్, రూరల్ ఆర్ఐ శ్రీకంఠ శ్రీనివాస రావుతో పాటు పలువురు మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు జీవితం ఆదర్శనీయం



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం భావితరాలకు ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. ప్రకాశం పంతులు జయంతి వేడుకలను స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షురాలు పేరం ప్రసన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజీవ్, నాగరాజు, అమర్, పులుసు సురేష్, పీటర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ భారీ ర్యాలీ



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

- ఒంగోలులో ఘనంగా సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు

ఒంగోలు టౌన్: సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు శనివారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలివచ్చారు. తొలుత కార్యకర్తలతో నెల్లూరు రోడ్డులోని మినీ స్టేడియం నుంచి ర్యాలీ బయలుదేరి ఊరచెరువులోని సభాస్థలికి చేరుకున్నారు. ర్యాలీలో సంప్రదాయ వేషధారణలతో వచ్చిన కార్యకర్తలు ఆకట్టుకున్నారు. విప్లవ వీరుల వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ర్యాలీలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సినీ హీరో మాదాల రవి, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు పీజీ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జెల్లి విల్సన్, హరినాథ్ రెడ్డి, జి.ఓబులేసు, కెవివి ప్రసాద్, అజయ్ కుమార్, జగదీష్, రామచంద్రయ్య, ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ, డేగ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభ ర్యాలీకి సీపీఎం ఘన స్వాగతం:

సీపీఐ రాష్ట్ర మహాసభల ర్యాలీకి సీపీఎం ఘన స్వాగతం పలికింది. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో నెల్లూరు బస్టాండు నుంచి తరలి వచ్చిన ర్యాలీకి స్థానిక సాగర్ సెంటర్ వద్ద సీపీఎం నాయకులు పూలు చల్లి, కరచాలనం చేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు, జిల్లా నాయకులు జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, కాలం సుబ్బారావు, కె.రమాదేవి, పి.కల్పన, పమిడి వెంకటరావు, దామా శ్రీనివాసరావు, బి.రఘురాం, అమీర్, నారాయణ తదితరులు ఉన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

- అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్



మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

ఒంగోలు టౌన్: అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, వారి సమస్యలను పరిష్కరించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో శనివారం అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారన్నారు. చంద్రబాబు నాయుడు మాటలు నమ్మి అగ్రిగోల్డ్ బాధితులు కూటమికి ఓటు వేసి గెలిపించారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా మారిందన్నారు. ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి బాధితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ ఆస్తులను ఆర్డర్ సంస్థ ద్వారా విలువలు లెక్కించాలని కోరారు. భూముల వేలం ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. బాధితుల సమస్యలపై స్పందించకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ నాయుడు, ప్రధాన కార్యదర్శి వీ తిరుపతిరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు వీ హనుమా రెడ్డి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన సంఘ బాధిత నాయకులు ఆరెళ్లమ్మ, మాణిక్యారావు, శేషు కుమార్ రెడ్డి, రాంబాబు, నాగలక్ష్మి, జగన్, మంత్రి నాయక్, సుబ్బారావు, రామదాసు, శంకరయ్య, బెల్లంకొండ శ్రీనివాస్, మునిశంకర్, ఖాదర్ బాష, మల్లిఖార్జున, భద్రం, కుమార్, బడిత అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల నటనతో ఆకట్టుకున్న తెలుగు వెలుగులు

ఒంగోలు టౌన్: పుస్తక మహోత్సవం 9వ రోజు పెదపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన 'తెలుగు వెలుగులు' నృత్య రూపకం విశేషంగా ఆకట్టుకుంది. ఒక గంట నిడివి కలిగిన ఈ నృత్య రూపకంలో తెలుగు సాహిత్య చరిత్ర సంస్కృతిని ఆవిష్కరించారు. చిన్నారులు అద్భుతమైన హావభావాలు ప్రదర్శించారు. ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలకు విద్యార్థుల ప్రతిభ, కళారూపాలను ప్రదర్శించారు. మోనో యాక్షన్, మైమ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తమకు ఇష్టమైన పాత్రలకు సంబంధించిన వేషధారణతో అచ్చుగుద్దినట్లుగా సంభాషణలను పలికించి ఔరా అనిపించుకున్నారు. అనంతరం మాదాల రంగారావు సాహిత్య వేదిక మీద ఏటుకూరి బలరామమూర్తి రచించిన మన చరిత్ర పుస్తకాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆవిష్కరించారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, మాదాల రవి, హరినాథ్ రెడ్డి, సాహితీవేత్తలు

రాహుల్ సాంకృత్యాయన్ రచించిన భారత దర్శనం పుస్తకాన్ని సీపీఐ రాష్ట్ర నాయకుడు హరినాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆ తరువాత ప్రకాశం జిల్లా సంస్కృతి, సాహిత్యం అనే అంశం మీద చర్చ జరిగింది. ఈ చర్చా కార్యక్రమంలో సినీ నటులు మాదాల రవి, ఏవీ పుల్లారావు, విజయవాడ బుక్ ఫెస్టివల్ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్ నాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదాల రవి మాట్లాడుతూ జిల్లా నుంచి ఎందరో కళాకారులు అద్భుతంగా రాణిస్తున్నారని చెప్పారు. జిల్లా కళల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రా నాయక్ ఆలపించిన వందనం వందనం పాట విశేషంగా అలరించింది. శనివారం పుస్తక మహోత్సవానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ప్రజల కోరిక మేరకు పుస్తక మహోత్సవం చివరి రోజున ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతున్న యువకుడు మృతి

అర్ధవీడు: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. అర్ధవీడు మండలంలోని మొహిద్దీన్‌పురం గ్రామానికి చెందిన వేల్పుల మల్లీశ్వరుడు (22) గత నెల 31వ తేదీ వ్యక్తిగత సమస్యలతో కలత చెంది క్షణికావేశంలో మద్యంలో గడ్డి మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు చికిత్స నిమిత్తం కంభంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు అర్ధవీడు ఎస్సై సుదర్శనయాదవ్ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


యోహాన్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేష్

పెద్దదోర్నాల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని పెద్ద బొమ్మలాపురం తూర్పుపల్లెలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వేశపోగు యోహాన్ (41) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కుటుంబంలో కొద్దిపాటి వివాదం తలెత్తిందని, ఈ నేపథ్యంలో యోహాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

మనస్తాపంతో మరో వ్యక్తి...

నాగులుప్పలపాడు: మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో శనివారం జరిగింది. కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామానికి చెందిన మల్లాల శ్రీను (53) ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన ఒక మహిళతో కొంతకాలంగా సహజీవనం చేస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి అతన్ని ఆ మహిళ దూరం పెట్టడంతో మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజియా సుల్తానా తెలిపారు.

లారీ క్యాబిన్ దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జరుగుమల్లి (సింగరాయకొండ): సాంకేతిక సమస్యల కారణంగా లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన శనివారం మధ్యాహ్నం జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట పరిధిలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో గల దాబా వద్ద జరిగింది. టంగుటూరు అగ్నిమాపక అధికారి తెలిపిన సమాచారం ప్రకారం.. జార్కండ్ నుంచి చెన్నై వెళ్తున్న లారీ చాసిస్ క్యాబిన్‌లో కె.బిట్రగుంట పరిధిలోకి రాగానే మంటలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన లారీ డ్రైవర్ అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. టంగుటూరు అగ్నిమాపక అధికారి ఏ రమణారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లి క్యాబిన్‌లోని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదం కారణంగా సుమారు రూ.8 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. సిబ్బంది పాండురంగారావు, కిషోర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చెడిపోయిందంటే చావే..!


సింగరాయకొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మూతబడిన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రం


మరమ్మతులకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్లు

- సింగరాయకొండలో మూతబడిన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రం
- ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోతే గుడ్లూరు, ఒంగోలు తీసుకెళ్లాల్సిన వైనం
- స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు వెయ్యి ట్రాన్స్‌ఫార్మర్లు
- ప్రతి నెలా సుమారు 50 ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు
- ఇతర ప్రాంతాలకు తరలించేందుకు తడిసి మోపెడవుతున్న రవాణా ఖర్చులు
- ఐదు నెలలుగా అవస్థపడుతున్న రైతులు, ప్రజలు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రం సుమారు ఐదు నెలలుగా మూతబడటంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు నెలల క్రితం వరకూ ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోతే స్థానిక మరమ్మతుల కేంద్రంలో మరమ్మతులు చేయించి ఒక్క రోజులోనే బిగించేవారు. కానీ, ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోతే మరమ్మతులు చేయాలంటే ఒంగోలు, గుడ్లూరు తీసుకెళ్లాల్సి వస్తోంది. దీంతో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగుచేసి బిగించాలంటే రెండు నుంచి మూడు రోజుల సమయం పట్టడమే కాకుండా రవాణా చార్జీలు అదనపు భారంగా మారుతున్నాయి.

నాలుగు మండలాలకు అవస్థలు...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు, ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు సింగరాయకొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అధికారం చేపట్టిన అతి తక్కువ సమయంలోనే దీన్ని ఏర్పాటు చేయడంతో రైతులు తమ ట్రాన్స్‌ఫార్మర్లకు తక్కువ ఖర్చుతో మరమ్మతులు చేయించుకుని బిగించుకునేవారు. దీనివలన ఈ కేంద్రం పరిధిలోని సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి, ఉలవపాడు మండలాల రైతులు, ప్రజలు లబ్ధిపొందేవారు. ఒక్కోసారి పొన్నలూరు, టంగుటూరు మండలాల రైతులు కూడా వచ్చేవారు. ప్రతి నెలా సుమారు 50 ట్రాన్స్‌ఫార్మర్ల వరకు మరమ్మతులు చేసేవారు. దీనివలన సమయం ఆదా అవడమే కాకుండా రవాణా ఖర్చులు భారీగా తగ్గాయి. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైతే గుడ్లూరు, ఒంగోలు తీసుకెళ్లాల్సి వచ్చేది. ఏ కేంద్రానికి వెళ్లాలన్నా సుమారు 30 కిలోమీటర్ల దూరం ఉండటంతో రవాణాకు సుమారు 2 నుంచి 3 వేల రూపాయలు ఖర్చయ్యేది. రెండు నుంచి మూడు రోజులు సమయం పట్టేది. కానీ, సింగరాయకొండలోనే కేంద్రం ఏర్పాటు చేయడంతో వెయ్యిలోపు ఖర్చుతో అతితక్కువ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ బాగుచేసి బిగించేవారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసివేత...

రైతాంగానికి, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న సింగరాయకొండ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 5 నెలల క్రితం మూసివేశారు. తమ పార్టీకి చెందిన కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్న ఉద్దేశంతో ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టర్‌కు గడువు ఉన్నప్పటికీ కాంట్రాక్టును పునరుద్ధరించకుండా అర్ధంతరంగా ఆపివేశారు. దీంతో కాంట్రాక్టర్ ఆ కేంద్రాన్ని మూసివేయగా, రైతులు, ప్రజలు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కోసం గుడ్లూరు, ఒంగోలు వెళ్తూ అవస్థపడుతున్నారు. మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగుచేసి తిరిగి తీసుకొచ్చి బిగించేందుకు సుమారు 2 నుంచి 3 రోజులు పడుతుండగా, ఒక్కోసారి నాలుగు రోజులు కూడా పడుతోంది. దీని వలన సమయంతో పాటు రవాణా ఖర్చులు పెరిగి డబ్బు కూడా వృథా అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త కాంట్రాక్టర్‌ను నియమించినా ప్రారంభం కాని పనులు...

సుమారు నెల క్రితం కొత్త కాంట్రాక్టర్‌ను సింగరాయకొండ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రానికి నియమించారు. కానీ, ఆయన పనులెప్పుడు ప్రారంభిస్తారో అర్థం కావడం లేదని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే బాగుచేసి మళ్లీ బిగించటం ఆలస్యం అవుతుండటంతో పక్క ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు భారం పడి అవి కూడా త్వరగా మరమ్మతులకు గురవుతున్నాయని విద్యుత్ శాఖ వారు తెలియజేస్తున్నారు. అందువలన ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సింగరాయకొండ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రంలో త్వరగా ప్రారంభించేలా చూడాలని, తద్వారా తమ ఇబ్బందులు తీర్చాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

బలవన్మరణానికి యత్నించిన మహిళ..
రక్షించిన పోలీసులు


రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ


మార్కాపురంలో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడి కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై అంకమ్మరావు

కంభం: బలవన్మరణానికి పాల్పడేందుకు రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను పోలీసులు కాపాడి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన శనివారం ఉదయం కంభంలో చోటుచేసుకుంది. కంభం పట్టణంలోని మేదరవీధికి చెందిన లాలమ్మ అనే మహిళ శనివారం ఉదయం 8.45 గంటల సమయంలో నాగులవరం రైల్వే గేటు సమీపంలో రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తోంది. ఆమె ఎర్ర చీర ధరించి ఉండటంతో రైలు పట్టాలపై వస్తున్న గరీభ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవరు అప్రమత్తమై రైలు ఆపడంతో మహిళకు ప్రమాదం తప్పింది. ఆ రైలు వెళ్లిపోయిన తర్వాత మళ్లీ రైలు పట్టాలపై నడుచుకుంటూ కంభం చెరువుకట్టవైపు ఆమె వెళ్తుండగా చెరువుకట్ట గేటు వద్ద ఉన్న రైల్వే సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. ఆమెను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్సై నరసింహారావు ఆ మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు.

మార్కాపురంలో మరో వ్యక్తిని కాపాడిన పోలీసులు...

మార్కాపురం: రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తిని పోలీసులు సకాలంలో స్పందించి కాపాడిన సంఘటన శనివారం మార్కాపురం రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. మార్కాపురం పట్టణానికి చెందిన టి.సురేంద్ర కుటుంబ సమస్యల కారణంగా తాను చనిపోతున్నట్లు ఉదయం 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలిపాడు. కుటుంబ సభ్యులు వెంటనే రూరల్ పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. డీఎస్పీ, సీఐ సూచనల మేరకు ఐటీ కోర్ టీమ్ సహాయంతో సురేంద్ర ఉన్న ప్రదేశాన్ని మార్కాపురం రూరల్ ఎస్సై అంకమ్మరావు గుర్తించారు. వెంటనే అతను ఉన్న రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుని సురేంద్ర ఆత్మహత్య చేసుకోకుండా కాపాడారు. అనంతరం అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి మానసిక ధైర్యం కల్పించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

పూరి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు

- నాలుగు కేజీల గంజాయి పట్టివేత
- ముగ్గురు అరెస్టు


పూరి ఎక్స్‌ప్రెస్‌లో పట్టుకున్న గంజాయిని చూపిస్తున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం

సింగరాయకొండ: పూరి–తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సుమారు నాలుగు కేజీల గంజాయి పట్టుకుని ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన సింగరాయకొండ రైల్వేస్టేషన్ వద్ద శనివారం సాయంత్రం జరిగింది. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో ఒంగోలు–సింగరాయకొండ రైల్వేస్టేషన్ల మధ్య ఒంగోలు మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేసి నాలుగు కేజీల గంజాయిని పట్టుకున్నారు. ముగ్గురు అనుమానితులను కూడా అదుపులోకి తీసుకుని స్థానిక రైల్వేస్టేషన్‌లో దిగారు. అక్కడి నుంచి గంజాయితో పాటు నిందితులను పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు తరలించారు. వారిని విచారించిన తర్వాత జీఆర్పీ పోలీసులకు అప్పగించనున్నట్లు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. వారిలో చిత్తూరు జిల్లా యడమారి మండలం బోడగుట్టపల్లె పోస్ట్, కుప్పూరు గ్రామానికి చెందిన కేపీ వీరప్పన్ ఒరిశా నుంచి చిత్తూరు వెళ్తున్నాడు. అతని బ్యాగ్‌ను తనిఖీ చేయగా గంజాయి దొరికింది. మిగతా ఇద్దరి వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. ఈ ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. తనిఖీల్లో ఎస్సైలు శ్రీకాంత్, చెంచయ్య, సుమారు 15 మందికిపైగా జీఆర్పీ, ఆర్పీఎఫ్, ఈగల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

గ్రూపు సభ్యులకు తెలియకుండానే..

- బ్యాంకు ఖాతాల నిర్వహణ బాధ్యతలు మార్చిన వెలుగు సీసీ
- జేసీకి బాధితుల ఫిర్యాదు

ఒంగోలు వన్‌టౌన్: గ్రూపు సభ్యులకు తెలియకుండా బ్యాంక్ ఖాతాల నిర్వహణ బాధ్యతలను మార్చి వేయడంపై బాధితులు శనివారం జేసీ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు అధికారులను కూడా ఫోర్జరీ సంతకాలతో టంగుటూరు మండలం వెలుగు సీసీ బురిడీ కొట్టించారని ఆరోపించారు. ఆ వివరాల ప్రకారం.. టంగుటూరు మండలం కందులూరు గ్రామంలోని కందులూరు–1 గ్రామైక్య సంఘంలో 25 స్వయం సహాయక గ్రూపులు సభ్యత్వం కలిగి ఉన్నాయి. గ్రామైక్య సంఘం అధ్యక్షురాలిగా బొట్ల వెంకట రమణమ్మ, కార్యదర్శిగా యు.వెంకటరావమ్మ, కోశాధికారిగా బి.సుశీలను ఎన్నుకుని బ్యాంక్ ఖాతాలను ప్రారంభించి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వెలుగు సీసీగా ఉన్న చెన్నుపాటి కవిత 25 డ్వాక్రా గ్రూపులకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో నకిలీ తీర్మానాలను సృష్టించారు. గ్రామైక్య సంఘ సభ్యులు కానివారి పేర్లతో నకిలీ పత్రాలు సృష్టించి కందులూరు బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌లో అక్రమ లావాదేవీలకు పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న గ్రూపు సభ్యులు దాదాపు 50 మంది శనివారం జేసీని కలిసి ఫిర్యాదు చేశారు. జేసీ స్పందించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్ డిప్యూటీ కలెక్టర్ కుమార్‌ను విచారణ అధికారిగా నియమించారు. కుమార్‌ను కలిసి ఆర్టీఐ ద్వారా సేకరించిన ఫోర్జరీ సంతకాల కాపీలు, తమ ఖాతాల అసలు కాపీలను అందజేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. అదే విధంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణను కలిసి సీసీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భార్యాభర్తలను ఢీకొట్టిన లారీ

- భార్య మృతి


మృతురాలు కోటేశ్వరమ్మ (ఫైల్)

సంతమాగులూరు (అద్దంకి రూరల్): బైకుపై వెళ్తున్న భార్యాభర్తలను వెనుక నుంచి లారీ ఢీకొట్టటంతో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన సంతమాగులూరు మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. సంతమాగులూరు ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. వినుకొండ మండలం గోకనకొండ గ్రామానికి చెందిన గద్దల తిరుపతయ్య, అతని భార్య గద్దల కోటేశ్వరమ్మ (44) బైక్‌పై కొమ్మాలపాడు వైపు నుంచి సంతమాగులూరు వైపు వెళ్తున్నారు. రామిరెడ్డిపాలెంలోని రామాలయం వద్దకు రాగానే వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. కోటేశ్వరమ్మకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన తిరుపతయ్యను 108 వాహనంలో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోర్టు ఆవరణలో వైద్య కేంద్రం

- ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి


వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: జిల్లా కోర్టు ఆవరణలో వైద్య కేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి శనివారం ప్రారంభించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం జిల్లా కోర్టు ఆవరణలోని పోస్టాఫీసు ఉన్న బ్లాక్‌లోని ఒక గదిలో ఏర్పాటు చేయగా, భారతి మాట్లాడుతూ న్యాయస్థానాల సముదాయం ఆవరణలో చికిత్స కేంద్రం ఏర్పాటు ద్వారా న్యాయవాదులు, న్యాయశాఖ అధికారులు, ఉద్యోగులతో పాటు కక్షిదారులకు ఎంతో ఉపయోగం ఉంటుందని అన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు జి.దీన, పందిరి లలిత, సీనియర్ సివిల్ జడ్జి హేమలత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్‌కే ఇబ్రహీం షరీఫ్, జూనియర్ న్యాయమూర్తులు భానుసాయి, నవ్యశ్రీ, ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు, ప్రకాశం జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు చాకిరి సుధాకరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలం ఎండ్లూరుడొంక వద్ద గల జిల్లా మహిళా ప్రాంగణంలో కంప్యూటర్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 సంవత్సరాల్లోపు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ పూర్తయిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9963005209 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

ఒంగోలు సబర్బన్: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక శాఖామంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం ఒంగోలు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఏపీ మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ విజయకుమార్, జేసీ ఆర్.గోపాలకృష్ణతో కలిసి మంత్రి పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

ఆంధ్రకేసరి త్యాగాలు మరువలేనివి



ఆంధ్రకేసరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్, సిబ్బంది

ఒంగోలు సబర్బన్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని మనందరం రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని పురస్కరించుకుని శనివారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణతో కలిసి పూలమాలలు వేసి మంత్రి నివాళులర్పించారు. టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమడు సంతోష్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. ఏబీఎం కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పింగళి పాండురంగారావు రచించిన జాతీయ స్థాయి ధీరుడు టంగుటూరి ప్రకాశం పుస్తకాన్ని మంత్రి డోలా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, డీఆర్‌ఓ చిన ఓబులేసు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డీటీసీ సుశీల, డీసీఓ పద్మశ్రీ, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఒంగోలు అర్బన్ తహసీల్దార్ పిన్నిక మధుసూదన్‌రావు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి జీవితం స్ఫూర్తిదాయకం...

ఒంగోలు టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతుడు బండారు దేవదాసు (ఫైల్)


ఘటన స్థలంలో దేవదాసు మృతదేహం

సీఎస్ పురం (పామూరు): నంద్యాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సీఎస్ పురం వడ్డెరపాలేనికి చెందిన వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు.. సీఎస్ పురం వడ్డెపాలేనికి చెందిన బండారు దేవదాసు (44)కాంక్రీట్ మిషన్లతో నంద్యాలలో భవన నిర్మాణ పనులు చేయిస్తూ జీవిస్తున్నాడు. నిత్యం వాకింగ్ చేసే అలవాటున్న దేవదాసు శనివారం ఉదయం ఎప్పటిలాగే నంద్యాలలో వాకింగ్‌కు వెళ్లి రహదారి పక్కన నడుస్తున్న క్రమంలో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవదాసు అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో వడ్డెపాలెంలో విషాదం అలముకుంది. మృతునికి భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.